ప్రతి ఉద్యోగికీ విరమణ తప్పదు

తిప్పాపూర్‌లో మాట్లాడుతున్న జిల్లా విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి

వేములవాడ రూరల్, జనవరి 31 : ప్రతి ఉద్యోగికీ విరమణ తప్పదని, ఉద్యోగిగా చేసిన సేవలు ఎప్పటికీ గుర్తుంటాయని జిల్లా విద్యాధికారి జగన్మోహన్‌రెడ్డి పేర్కొన్నారు. శుక్రవారం వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్ జడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు బోయినపల్లి తిరుపతి ఉద్యోగ విరమణ కార్యక్రమానికి అతిథిగా హాజరయ్యారు. అనంతరం డీఈవో మాట్లాడుతూ, ఉద్యోగిగా ఆయన చేసిన సేవలు గుర్తుంటాయన్నారు. అనంతరం తిరుపతిని ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవోలు బన్నాజీ, కిషన్, ఉపాధ్యాయులు శ్రీనివాస్, సంతోష్, అంజయ్య, తదితరులున్నారు.

రాజన్న ఆలయంలో నలుగురు ఉద్యోగ విరమణ



ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులను సన్మానించిన ఈవో

వేములవాడ టౌన్, జనవరి 31 : రాజన్న ఆలయంలో 30 సంవత్సరాలకు పైగా విధులు నిర్వర్తించిన నలుగురు ఉద్యోగులు శుక్రవారం ఉద్యోగ విరమణ చేశారు. ఉద్యోగ విరమణ చేసిన వారిలో ఆలయ ప్రధానార్చకులు (ఇన్‌చార్జి స్థానాచార్యులు అప్పాల భీమాశంకర్, ఆలయ పర్యవేక్షకులు బండారి తిరుపతి రావు, జూనియర్ అసిస్టెంట్ కాసర్ల లక్ష్మయ్య, హెల్పర్ రేగుల దేవేందర్ ఉన్నారు. ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగులకు ఆలయ అర్చకులు వేదోక్త ఆశీర్వచనం చేయగా, ఈవో వినోద్‌రెడ్డి ఘనంగా సన్మానించి, స్వామివారి ప్రసాదం, చిత్రపటం అందజేశారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు, ఆలయ అర్చకులు, ఉద్యోగ విరమణ చేసిన ఉద్యోగుల బంధు, మిత్రులు పాల్గొన్నారు.

సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దు

వేములవాడ ఆర్టీసీ డిపోలో ఉత్తమ డ్రైవర్ ఎల్‌బీరావును సన్మానిస్తున్న ట్రాఫిక్ ఎస్ఐ రాజు

వేములవాడ రూరల్, జనవరి 31 :సెల్‌ఫోన మాట్లాడుతూ డ్రైవింగ్ చేయవద్దని వేములవాడ ట్రాఫిక్ రాజు పేర్కొన్నారు. శుక్రవారం వేములవాడ ఆర్టీసీ డిపో లో జాతీయ రోడ్డు భద్రతా మహోత్సవాల సందర్భంగా ఉత్తమ డ్రైవర్లను సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, డ్రైవర్ ఆరోగ్యంగా ఉండాలని, డిఫెన్స్ డ్రైవింగ్ చేయాలని, సీట్ బెల్టు ధరించాలని సూచించారు. అనంతరం డ్రైవర్లను ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డిపో మేనేజర్ శ్రీనివాస్, ఏఎంఎఫ్ రామచంద్రం, ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ సత్యనారాయణ, గ్యారేజీ సిబ్బంది ట్రాఫిక్ సెక్యూరిటీ సిబ్బంది, పీఆర్వో శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

బడిలో బాత్రూం డోర్లు చోరీ

కోనరావుపేట, జనవరి 31: మండలంలోని కొండాపూర్ మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో దుండగులు పాఠశాలలో చొరబడి మరుగుదొడ్డి, మూత్రశాలల గదులకు ఉన్న డోర్లను ఎత్తుకెళ్లారు. రోజువారీ పాఠశాలకు తాళం వేసి ఇంటికి ఉపాధ్యాయులు ఇంటికి వెళ్లారు. ఈక్రమంలో రాత్రి సమయంలో గుర్తు తెలియని వ్యక్తులు పాఠశాలలో చొరబడి డోర్లను ఎత్తుకెళ్లి అమ్ముకున్నారు. పోలీసులు దుండగులను గుర్తించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

స్థానిక ఎన్నికలే లక్ష్యం కావాలి

మాట్లాడుతున్న నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు

- కార్యకర్తల బలమేంటో ఎన్నికల్లో చూపించాలి
- అబద్ధాలు చెప్పి చెప్పి కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లో మరింత బలహీన పడుతోంది
- 420 హామీలతో కాలం వెల్లదీస్తున్న కాంగ్రెస్
- బీఆర్ఎస్ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు
- వేములవాడ అర్బన్ మండల బీఆర్ఎస్ కార్యకర్తల ఆత్మీయ సమ్మేళనం

వేములవాడ రూరల్, జనవరి 31 : స్థానిక సంస్థల ఎన్నికలే మన ప్రధాన లక్ష్యం కావాలని వేములవాడ బీఆర్ఎస్ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి చల్మెడ లక్ష్మీనర్సింహారావు అన్నారు. శుక్రవారం వేములవాడ మండలం అగ్రహారం శ్రీ కన్వెన్షన్‌లో వేములవాడ అర్బన్ మండల బీఆర్ఎస్ కార్యకర్తలతో ఆత్మీయ సమ్మేళనం నిర్వహించారు. ఈ సందర్భంగా చల్మెడ లక్ష్మీనర్సింహారావు మాట్లాడుతూ, గడిచిన ఏడాది కాలంలో కాంగ్రెస్ పార్టీ ప్రజలకు అబద్ధాలు చెప్పిచెప్పి మరింత బలహీన పడిందన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు కాంగ్రెస్ పార్టీకి గుణపాఠం చెబుతారని, ప్రతి కార్యకర్తా తన బలమేంటో చూపించాల్సిన సమయం ఆసన్నమైందన్నారు. ఆరు గ్యారంటీలతో ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ గడిచిన కాలంలో ప్రజలకు అబద్ధాలు చెప్పి చెప్పి చివరికి చేసింది ఏం లేదన్నారు. ముఖ్యంగా రైతు భరోసా ఇస్తామని నమ్మబలికి తీరా సమయానికి వాయిదాల మీద వాయిదాలు వేస్తూ ఏడాది కాలం పూర్తి చేసిందన్నారు. మరో ఏడాది కాలానికి ఏం చెప్పాలో ఆలోచనలో పడిందన్నారు. ఒకే ఒక్క హామీ అమలు చేసి, మిగతా గ్యారెంటీల సంగతి ఏంటని ప్రశ్నించే కార్యకర్తలు, నాయకులను ఏదో ఒక కారణం చూపి అరెస్టు చేయిస్తున్నారే తప్ప, అభివృద్ధి జరిగిందేమీ లేదన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలను తక్కువ అంచనా వేస్తున్న కాంగ్రెస్ ప్రభుత్వం రాబోయే స్థానిక సంస్థల ఎన్నికల్లో కార్యకర్తల బలమేంటో చూపించాలన్నారు. కార్యకర్తలకు తనవంతు సహకారం ఎప్పటికీ ఉంటుందన్నారు. కార్యక్రమంలో సెస్ డైరెక్టర్ హరిచరణ్‌రావు, మాజీ జడ్పీటీసీ మ్యాకల రవి, మాజీ ఎంపీపీ బూర వజ్రమ్మబాబు, మాజీ వైస్ ఎంపీపీ ఆర్‌సీరావు, మాజీ సర్పంచులు స్వయంప్రభ, రాణి, రాజేశం, వెంకటరమణ రావు, జిల్లా కోఆర్డినేటర్ వనపట్ల సందీప్, గ్రామాధ్యక్షులు, ముఖ్య నాయకులు, బీఆర్ఎస్ కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

ఆత్మీయ సమ్మేళన కార్యక్రమానికి హాజరైన బీఆర్ఎస్ కార్యకర్తలు

రోడ్డుపై పంచాయతీ ఎన్నికల ఎన్వలప్ కవర్లు

వేములవాడ నందికమాన్ వద్ద రోడ్డు పైన పడిఉన్న పంచాయతీ ఎన్నికల ఎన్వలప్ కవర్లు

వేములవాడ రూరల్, జనవరి 31 : గ్రామ పంచాయతీ ఎన్నికలపై గ్రామాల్లో చర్చలు జరుగుతుండగానే శుక్రవారం వేములవాడ మండలం మారుపాక నందికమాన్ వద్ద రోడ్డుపైన గ్రామ పంచాయతీ ఎన్నికలకు సంబంధించిన ఎన్వలప్ కవర్లు కనిపించడం కలకలం రేపింది. గ్రామ పంచాయతీ వార్డు మెంబర్, సర్పంచులకు జరిగే ఎన్నికకు సంబంధించిన కౌంటర్ ఫాయిల్స్‌తో కూడిన బ్యాలెట్ పేపర్లు ఉంచే కవర్లు రోడ్డు పై పడి ఉండడంతో అటుగా వెళ్లేవారు ఆసక్తిగా చూశారు. సర్పంచ్ ఎన్నికల చర్చల నేపథ్యంలో ఎన్వలప్ కవర్లు బయటపడడంతో మరోసారి చర్చకు దారితీసింది. రోడ్డు పైన మూడు కట్టలు బయటపడంతో వాటిని చూసిన వారు సోషల్‌మీడియాలో వైరల్ చేశారు. ఈ విషయమై ఎంపీడీవో మల్లోత్రాను వివరణ కోరగా ఎన్వలప్ కవర్లు మాకు సంబంధించినవి కావని, గతంలో ఉంటే వాటిని కాల్చి వేసినట్లు ఆయన స్పష్టం చేశారు. వేములవాడ మండలంకు సంబంధించినవి కాకపోతే ఇవి ఎక్కడివో అధికారులు తేల్చాల్సి ఉంది.

స్వగ్రామానికి మృతదేహం

మల్లేశ్ (ఫైల్)

వేములవాడ రూరల్, జనవరి 31: వేములవాడ మున్సిపల్ పరిధిలోని తిప్పాపూర్‌కు చెందిన గుడిసె మల్లేశ్ (46) దుబాయిలో ప్రమాదవశాత్తు మృతిచెందగా శుక్రవారం స్వగ్రామం చేరుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం తిప్పాపూర్‌కు చెందిన మల్లేశ్ జీవనోపాధి కోసం 18 నెలల క్రితం దుబాయి వెళ్లాడు. అక్కడ పనిచేసే క్రమంలో ఇసుకదిబ్బలు మీద పడడంతో మృతి చెందాడు. మృతునికి భార్య పరిమళ, కూతుళ్లు కీర్తన, స్వాతికప్రియ, కుమారుడు పెగ్నేష్ ఉన్నారు. దాదాపు 37 రోజుల తర్వాత మృతదేహం స్వగ్రామం చేరుకుంది. నిరుపేద కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

గీత కార్మికుడికి గాయాలు

కోనరావుపేట, జనవరి 31: మండల కేంద్రానికి చెందిన గీత కార్మికుడు ఎగోలపు మల్లేశం గౌడ్‌కు తీవ్రగాయాలయ్యాయి. రోజువారీగా కులవృత్తిలో భాగంగా ఈత చెట్టు ఎక్కి కల్లు గీస్తున్న సమయంలో మోక జారి ఉన్నట్టుండి కింద పడిపోయాడు. దీంతో కాలు విరిగి తీవ్రగాయాలు కాగా, గమనించిన కుటుంబ సభ్యులు వేములవాడలోని ఓ ప్రైవేటు దవాఖానకు తరలించారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం సాయం అందించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్‌గా సమ్మయ్య

బాధ్యతలు స్వీకరిస్తున్న సమ్మయ్య

సిరిసిల్ల టౌన్, జనవరి 31: సిరిసిల్ల మున్సిపల్ కమిషనర్‌గా సల్వాది సమ్మయ్య శుక్రవారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ కమిషనర్‌గా విధులు నిర్వహించిన దుబ్బాక లావణ్య హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లారు. హుజూరాబాద్ కమిషనర్‌గా పనిచేసిన సమ్మయ్య సిరిసిల్లకు బదిలీపై వచ్చారు. గత సంవత్సరం ఫిబ్రవరి నెలలో లావణ్య సిరిసిల్లకు కమిషనర్‌గా వచ్చారు.

మల్లారెడ్డిపేట వాసికి డాక్టరేట్

డాక్టరేట్ పట్టా స్వీకరిస్తున్న సత్యనారాయణ

గంభీరావుపేట, జనవరి 31: మండలంలోని మల్లారెడ్డిపేటకు చెందిన పత్తెం సత్యనారాయణ ఇంగ్లిష్‌లో డాక్టరేట్ పట్టా స్వీకరించాడు. ఇంగ్లిష్ యూజ్ ఏ గ్లోబల్ లింగ్వా ఫ్రాంకా లాంగ్వేజ్ టీచింగ్ అండ్ ఇంటర్ కల్చరల్‌పై చిక్కులను అన్వేషించడం అనే అంశంపై వారు పరిశోధన చేశారు. రాజస్థాన్‌కు చెందిన సన్‌రైజ్ విశ్వవిద్యాలయంలో ప్రొఫెసర్ బ్రాజ్ గోపాల్ సింగ్ చౌహాన్ పర్యవేక్షణలో విజయవంతంగా పూర్తిచేసి డాక్టరేట్ పట్టా పొందారు. సత్యనారాయణను ఈ సందర్భంగా మల్లారెడ్డిపేట గ్రామస్తులు అభినందించారు.

మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలి

- జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు పరశురాం
- కలెక్టర్‌కు వినతిపత్రం అందజేత

కలెక్టరేట్ వద్ద మాట్లాడుతున్న జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యక్షుడు మ్యాకల పరశురాం

కలెక్టరేట్, జనవరి 31 : మహిళలకు సత్వర న్యాయం జరిగేలా మహిళలపై జరిగే నేరాలను నిరోధించడం కోసం మహిళా పోలీస్ స్టేషన్ ఏర్పాటు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు మ్యాకల పరశురాం అన్నారు. శుక్రవారం కలెక్టరేట్‌లో కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన కలెక్టరేట్ వద్ద మాట్లాడుతూ, జిల్లాలో ప్రత్యేక మహిళా పోలీస్ స్టేషన్ ఉంటే మహిళలకు సంబంధించిన సమస్యలను స్వేచ్ఛగా వివరించడానికి ఆస్కారముంటుందన్నారు. మహిళ పోలీస్ స్టేషన్ ఉంటే గృహహింస, వేధింపుల ఘటనలను వివరించడానికి మహిళలు ముందుకు వస్తారని తెలిపారు. ఇక్కడ జిల్లా ఉపాధ్యక్షుడు బిళ్ల వెంకట్రాములు, కోనరావుపేట మండల ప్రెసిడెంట్ కీసరి శ్రీనివాస్, రుద్రంగి మండల అధ్యక్షుడు మీసాల మల్లేశ్ పటేల్, జాయింట్ సెక్రటరీ బోయిని శ్రీనివాస్ పాల్గొన్నారు.

ఉపాధి ఉద్యోగులకు జీతాలు చెల్లించాలి

ఎంపీడీవో ప్రదీప్ కుమార్‌కు వినతి పత్రం సమర్పిస్తున్న ఉపాధి హామీ ఉద్యోగులు

చందుర్తి,జనవరి 31: ఉపాధి హామీ విభాగంలో పనిచేస్తున్న ఉద్యోగులకు సక్రమంగా జీతాలు చెల్లించాలని మండల ఉపాధి హామీ ఉద్యోగులు అన్నారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో ఇన్‌చార్జి ఎంపీడీవో ప్రదీప్ కుమార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, మూడు నెలలుగా జీతం లేక అనేక ఇబ్బందులు పడుతున్నామన్నారు. సీఎం గతంలో ఇచ్చిన హామీని వెంటనే అమలు చేయాలని కోరారు.

నమస్తే తెలంగాణ CLASSIFIED

వాస్తు చూడబడును

★వాస్తు చూడటం, ఇంటి మోడల్ ప్లానులు తీయడం, భూమి కొలతలు తీయడం,ఆటోక్యాడ్‌లో డ్రాయింగ్ చేయడం నేర్పబడును, వాస్తు చూడబడును. సంప్ర॥ M. రాజేష్, సెల్ : 9502438614

NTK-337604

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధము లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

Classified Ads

మీకు కావలసిన సమాచారం కొరకు సులభమైన మార్గం.. మన నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్‌లో ప్రకటన ఇవ్వడం

4 లైన్ల ప్రకటన కేవలం 200/- మాత్రమే

ప్రతి ఎక్స్‌ట్రా లైన్‌కి 50/- మాత్రమే

3+1 స్కీం కలదు

ప్రకటనల విభాగం...

GST 5% వర్తించును

Cell: 9182 777 571
9182 777 189

శివంగాళపల్లిలో దొంగతనం

కోనరావుపేట, జనవరి 31: మండలంలోని శివంగాళపల్లి గ్రామంలో మునిగె లచ్చవ్వ ఇంట్లో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. లచ్చవ్వ ఇంట్లో ఒంటరిగానే ఉండగా, ఇల్లుకు తాళం వేసి ఇటీవల తన బంధువుల ఇంటికి వెళ్లింది. ఇది గమనించిన దుండగులు రాత్రి వేళల్లో తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడి రూ.2వేలు ఎత్తుకెళ్లారు. ఇంట్లోనే ఉన్న బంగారం ఆభరణాలు ఉన్నాయని బాధితురాలు తెలిపింది. పోలీసులు లచ్చవ్వ ఇంటికి వెళ్లి చుట్టూ పక్కల వారి నుంచి వివరాలను సేకరించారు. శివంగాళపల్లి గ్రామం అటవీ ప్రాంతంలో ఉండడంతోపాటు రాత్రి సమయాన వరుస దొంగతనాలు జరుగుతున్నాయని గ్రామస్తులు పేర్కొన్నారు. పోలీసులు రాత్రి సమయాన పెట్రోలింగ్ నిర్వహించి నిఘా పెంచాలని కోరుతున్నారు.

చెరుకు పంటలో యాజమాన్య పద్ధతులు పాటించాలి

వేములవాడ,(బోయినపల్లి) జనవరి 31: చెరుకు పంటలో రైతులు యాజమాన్య పద్ధతులు పాటిస్తే లాభాలు గడించవచ్చని జిల్లా ఏరువాక కేంద్రం, కరీంనగర్ కో ఆర్డినేటర్ మదన్ మోహన్‌రెడ్డి అన్నారు. బోయినపల్లి మండల కేంద్రంలో రైతులతో చర్చాగోష్ఠి నిర్వహించారు. కార్యక్రమంలో శాస్త్రవేత్త రాకేశ్, కృష్ణచైతన్య, సాయిచరణ్, రాజేంద్రప్రసాద్, జిల్లా వ్యవసాయాధికారి అప్జల్ భేగం, ఏడీఏ రామరావు, ఏవో ప్రణీత, తదితరులున్నారు.

అడ్వొకేట్‌నంటూ డబ్బులు వసూలు చేసిన ఒకరిపై కేసు

తెలంగాణ చౌక్, జనవరి 31: అడ్వొకేట్‌నంటూ అమాయక ప్రజలను మోసం చేసి డబ్బులు వసూలు చేసిన సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్‌కు చెందిన ఏనుగు ఫణిందర్‌పై కేసు నమోదు చేసి రిమాండ్‌కు తరలించినట్లు టౌన్ సీఐ కృష్ణ శుక్రవారం ఒక ప్రకటనలో వెల్లడించారు. ఫణిందర్ జల్సాలకు అలువాటుపడి ఆన్‌లైన్ గేములో డబ్బులు పెట్టి విచ్చలవిడిగా ఖర్చు చేసేవాడన్నారు.. అధిక మొత్తంలో డబ్బులు సంపాదించాలనే ఉద్దేశంతో అడ్వకేట్ వద్దకు న్యాయం కోసం వచ్చే వారిని గుర్తించి అడ్వొకేట్‌నంటూ నమ్మబలికేవాడు. ఈ నేపథ్యంలో బాధితులతో పరిచయాలు పెంచుకొని హైదరాబాద్‌లో కోర్టు నుంచి చాలా మంది లాయర్లు, అధికారులు తెలుసని సమస్యలు పరిష్కరిస్తామని నమ్మించి అధిక మొత్తంలో డబ్బులు వసూళ్లు చేసేవాడని తెలిపారు. పట్టణంలోని ఒక ప్రైవేట్ పాఠశాల ప్రిన్సిపాల్ భూమి సమస్యను పరిష్కరిస్తామని నమ్మించి రూ.25 లక్షలు తీసుకున్నట్లు, సంజీవయ్య నగర్‌కు చెందిన దరిపల్లి సురేశ్, రమేశ్ వద్ద చెక్‌బౌన్స్ కేసులో పలు దఫాల్లో రూ.91,52,050, పెద్దూర్‌లోని డబుల్ బెడ్‌రూంలో ఇల్లు ఇప్పిస్తానని మహిళ విజయలక్ష్మీ వద్ద రూ.1.90 లక్షలు చంద్రపేటకు చెందిన ఎల్ల లలిత భూమి విషయంలో ఇంజక్షన్ అర్డర్స్ ఇప్పిస్తానని సుమారు రూ.12లక్షల వరకు తీసుకొని మోసం చేసినట్లు బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. ఏనుగు ఫణిందర్ బాధితులు ఇంకా ఎవ్వరైన ఉంటే పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేయాలని ప్రకటనలో పేర్కొన్నారు.

జిల్లా మహా సభలను జయప్రదం చేయండి

కలెక్టరేట్, జనవరి 31 : ఎస్ఎఫ్ఐ జిల్లా 4వ మహాసభలను విజయవంతం చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగరపు రజినీకాంత్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం ఎస్ఎఫ్ఐ జిల్లా ముఖ్య కార్యకర్తల సమావేశం సిరిసిల్ల జిల్లా కార్యాలయంలో ఏర్పాటు చేశారు. అతిథిగా రాష్ట్ర ఉపాధ్యక్షుడు శనిగారపు రజనీకాంత్ హాజరయ్యారు. ఫిబ్రవరి 5, 6 తేదీల్లో జరిగే జిల్లా నాలుగవ మహాసభలను జయప్రదం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షులు శనిగారపు రజనీకాంత్ మాట్లాడుతూ జిల్లా మహా సభలకు జిల్లా విద్యార్థులు మేధావులు అధిక సంఖ్యలో హాజరై జయప్రదం చేయాలని కోరారు. ఇక్కడ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు మంద అనిల్, మల్లారపు ప్రశాంత్, జిల్లా ఉపాధ్యక్షుడు మనోజ్, రాకేశ్ తదితరులున్నారు.

గోరంటాల శివారులో అదుపు తప్పిన ఆర్టీసీ బస్సు

- తృటిలో తప్పిన ప్రమాదం.. 15 మందికి గాయాలు

ప్రమాద బాధితులను పరామర్శిస్తున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

గంభీరావుపేట, జనవరి 31: మండలంలోని గోరంటాల శివారున శుక్రవారం కామారెడ్డి డిపో బస్సు అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. దీంతో బస్సులో ప్రయాణిస్తున్న 15 మందికి పైగా ప్రయాణీకులకు గాయాలు కావడంతో చికిత్స నిమిత్తం సిరిసిల్ల ఏరియా దవాఖానకు తరలించారు. కామారెడ్డి నుంచి కరీంనగర్‌కు సుమారు 52 మంది ప్రయాణీకుల తో బయలుదేరింది. గోరంటాల శివారుకు రాగానే బస్సు అదుపు తప్పి పంట పొలాల్లోకి దూసుకెళ్లింది. దీంతో 15 మందికి గాయాలయ్యాయి. ఘటనా స్థలాన్ని డిపో మేనేజర్ ఇందిర పరిశీలించారు.

మెరుగైన వైద్యం అందించాలి : కలెక్టర్

సిరిసిల్ల టౌన్, జనవరి 31: రోడ్డు ప్ర మాద బాధితులకు మెరుగైన వైద్యమం దించాలని కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా ఆదేశించారు. గంభీరావుపేట మండలం గోరంటాల శివారులో కామారెడ్డి డిపోకు చెందిన ఆర్టీసీ బస్సు గోరంటాల వద్ద పొలాల్లోకి దూసుకెళ్లింది. ఈ ప్రమాదంలో ప్రయాణికులకు గాయాలు కాగా సిరిసిల్లలోని ప్రభుత్వ ప్రధాన దవాఖాకు తరలించారు. విషయం తెలుసుకున్న కలెక్టర్ హాస్పిటల్‌కు చేరుకుని క్షతగాత్రులను పరామర్శించారు. మెరుగైన వైద్య మందించాలని వైద్యులను ఆదేశించారు.

కనగర్తిలో నల్లాలో మురుగునీరు

- ఇబ్బంది పడుతున్న జనం
- అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తుల ఆరోపణ

కనగర్తి గ్రామంలో మంచి నీటి బావిలో ఉన్న మురుగు నీరు

కనగర్తిలో నల్లా నుంచి వస్తున్న మురుగు నీరు

కోనరావుపేట, జనవరి 31: మంచినీటి బావి నుంచి నల్లాలో మురుగు నీరు రావడంతో తీవ్ర ఇబ్బందులు పడుతునామని, అధికారులు పట్టించుకోవడం లేదని గ్రామస్తులు ఆరోపిస్తున్నారు. మండలంలోని కనగర్తి గ్రామంలో మంచినీటి బావిలో నాచు, మురుగునీరు ఉండగా వాటినే నల్లా ద్వారా సరఫరా చేస్తున్నారని తెలిపారు. దీంతో ఇంట్లో మురుగు నీటితో అవసరాలను తీర్చుకోవాల్సి వస్తుందన్నారు. అధికారులు పట్టించుకోకపోవడంతో మురుగు నీటితో వ్యాధుల ప్రబలే అవకాశం ఉందని తెలిపారు. ఈ విషయాన్ని అధికారుల దృష్టికి తీసుకువెళితే పట్టించుకోవడం లేదన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మురుగునీరు సరఫరా కాకుండా తగిన చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు. ఈ విషయమై గ్రామ పంచాయతీ కార్యదర్శి కవిత రెడ్డి వివరణ కోరగా బావిలో వాచర్ పగిలిపోయి నీరు మురికిగా మారిందన్నారు. వెంటనే సమస్యను తెలుసుకొని పైపునకు వాచర్ వేసి మరమ్మతులు నిర్వహించినట్లు తెలిపారు.

గజసింగవరంలో దొంగల హల్‌చల్

గంభీరావుపేట, జనవరి 31: మండలంలోని గజసింగవరంలో గురువారం రాత్రి తాళం వేసిన రెండు ఇళ్లలో గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడ్డారు. గ్రామానికి చెందిన శ్రీకాంత్ ఇంట్లో రూ.60 వేల నగదు, 2 తులాల బంగారం, నాలుగు పట్టగొలుసులు ఎత్తుకెళ్లారు. అదే విధంగా బాలయ్య ఇంట్లో తాళం పగులగొట్టారన్నారు. బాధితుల ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని డాగ్ స్క్వాడ్ ఆధారంగా విచారణ చేస్తున్నామని ఎస్ఐ శ్రీకాంత్ తెలిపారు.

ఆలయ నిర్మాణానికి స్థల విరాళం

ఎన్నారై మోతె బాబును సన్మానిస్తున్న గ్రామస్తులు

చందుర్తి, జనవరి 31: చందుర్తి మండల కేంద్రంలో శివాలయ నిర్మాణానికి గ్రామానికి చెందిన ప్రముఖ ఎన్నారై మోతే బాబు కృషి చేశారు. శుక్రవారం రూ.25లక్షల విలువ చేసే 200 గజాల స్థలాన్ని గ్రామస్తులకు అందజేశారు. గతంలో సొంతూరిపై మమకారంతో మోతె బాబు అనేక అభివృద్ధి కార్యక్రమాల్లో చేయూతనిచ్చారు. గ్రామంలో గౌతమ బుద్ధుడి విగ్రహం ఏర్పాటు ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు శుద్ధ జల కేంద్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా స్థలానికి సంబంధించిన డాక్యుమెంట్ పత్రాలను గ్రామస్తులకు అందజేశారు. ఇక్కడ గొట్టె ప్రభాకర్, పులి సత్యం గౌడ్, కత్తి తిరుపతి గౌడ్, పిట్టల బాబు, దారం చంద్రం, బుర్ర శ్రీనివాస్ గౌడ్, దేవుడి మల్లేశ్, తోట శ్రీనివాస్ ఉన్నారు.

పౌరహక్కుల దినోత్సవం బహిష్కరణ

సుద్దాలలో మాట్లాడుతున్న నేతలు

కోనరావుపేట, జనవరి 31: పౌర హక్కుల దినోత్సవానికి ప్రతి సారి అధికారులు డుమ్మా కొట్టడంతో గ్రామంలో దళిత సంఘ నాయకులు పౌరహక్కుల దినోత్సవాన్ని బహిష్కరించారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా స్పందించి పౌరహక్కుల దినోత్సవానికి అధికారులు హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలని కోరారు. ఇక్కడ కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎర్రవెల్లి నాగరాజు, భీమ్ ఆర్మీ జిల్లా అధ్యక్షుడు దొబ్బల ప్రవీణ్‌కుమార్, నేతలు ఎర్రవెల్లి విజయ్, నరేశ్, వంశీ, ప్రణీత్ తదితరులున్నారు.